నారీమణులు.. అభివృద్ధికి సారథులు

సృష్టికి మూలం మహిళ... స్త్రీ లేనిది జననం లేదు, జీవం లేదు. ఆకాశం, అవనిలో సగమైన మహిళ నేడు సాంకేతిక, విద్య, వైద్య, విజ్ఞానం, రాజకీయం తదితర రంగాల్లో పైచేయి సాధించారనడంలో అతిశయోక్తి లేదు. సమాజంలో ముందుండి 'ఆడదంటే అబల కాదు సబల'అని నేటి మహిళ లోకం నిరూపించింది. ఈ నేపథ్యంలో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని గృహిణి నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, డ్వాక్రా రుణం తీసుకొని డైరీ ఫామ్ నిర్వహిస్తున్న మహిళలపై ప్రత్యేక కథనం. – ఘట్‌కేసర్



ప్రజాసేవలో మమతారాణి ప్రత్యేకం..


బద్దం మమతారాణి, పోచారం

పోచారం: నిర్విరామంగా పదేళ్ల పాటు ప్రజాసేవ చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు పోచారం ప్రాంతానికి చెందిన బద్దం మమతారాణి. ఘట్‌కేసర్ మండల ప్రజా పరిషత్‌లో ఎంపీటీసీగా ఐదేళ్లు, పోచారం మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా మరో ఐదేళ్లు పనిచేసి పాలనలో ప్రత్యేకతను చాటుకున్నారు. పోచారంలో ఈదమ్మ, మహంకాళమ్మ, పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, నల్లపోచమ్మ ఆలయాలను భక్తుల సహకారంతో సుమారు రూ. 2.70 కోట్లతో నిర్మించారు. అలాగే అన్నానగర్‌లో రూ. 90 లక్షల వ్యయంతో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నారు. ఆలయాల ప్రారంభోత్సవం రోజు మమతారాణి ఆహ్వానం మేరకు తెలంగాణ జాగృతి సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యఅతిథిగా హాజరై బంగారు బోనం సమర్పించారు. అదేరోజు కవితపై హెలీకాప్టర్‌తో పూల వర్షం కురిపించారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో ప్రజాప్రతినిధిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

గృహిణి నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్...


ముల్లి పావనీజంగయ్య యాదవ్, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్


ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్-2022 అవార్డు అందుకుంటున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్ (ఫైల్)

ముల్లి పావనీజంగయ్య ఒక సాధారణ గృహిణి, రాజకీయ అనుభవం లేదు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేయగా అదృష్టం ఆమెను వరించింది. కౌన్సిలర్‌గా విజయానంతరం ఏకంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి మొదటి చైర్ పర్సన్‌గా ఎన్నికై ంది. కుటుంబ సభ్యులు, కౌన్సిల్ సభ్యుల సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. దుకాణాలు వద్ద డబ్బాలు, చెత్తను సేకరించడానికి వాహనాలు ఏర్పాటు చేసింది. మహిళలు, ప్రజల సమూహం ఉండే ప్రదేశాల్లో సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించింది. కౌన్సిల్‌లో కొందరు అవిశ్వాసం పెట్టిన తన వర్గం సహకారంతో గట్టెక్కింది. లక్ష కంటే తక్కువ జనాభా ఉన్న పట్టణాలకు కేంద్రం ఇచ్చే ''స్వచ్ఛ సర్వేక్షణ్''అవార్డును గెలుచుకుంది. పట్టణ సుందరీకరణ, బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం, ప్లాస్టిక్ నిషేధం, చెత్త సేకరణ, పట్టణ ప్రగతిలో ప్రతిభ కనబరచి 2021, 2022లో వరుసగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును గెలుచుకొని ఢిల్లీలో స్వీకరించింది.

అనితా.. ఎందరో మహిళలకు స్ఫూర్తి...


డెయిరీ ఫామ్ వద్ద పనిచేస్తున్న అనితామహిపాల్‌రెడ్డి

అంకుషాపూర్ గ్రామానికి చెందిన అట్ల అనితామహిపాల్‌రెడ్డి డ్వాక్రా గ్రూపు లక్ష్మీ ప్రసన్న సంఘంలో సభ్యురాలు. 2014లో సంఘంలో రూ.50 వేలు రుణం తీసుకొని ఓ పాడి గేదెను కొనుగోలులో చేసింది. ఆరు నెలల తర్వాత రూ. 40 వేలు, మూడోసారి రూ.50వేలు రుణం తీసుకొని మరో రెండు గేదెలు కొనుగోలు చేసింది. రోజుకు 10 లీటర్లతో ప్రారంభమైన పాల వ్యాపారం అభివృద్ధి చెంది నేడు 14 గేదెలకు చేరుకుంది. వర్షాకాలంలో గేదెలను బయట గడ్డి మేపి ఎండాకాలంలో రూ.50వేలకు పైగా వెచ్చించి గడ్డి కొనుగోలు చేస్తుంది. గేదెల పనులు చేసుకుంటూ భర్తతో కలిసి గ్రామంలో డెయిరీ ఫామ్ ప్రారంభించింది. రైతుల దగ్గర పాలు కొనుగోలు చేసి విజయ డెయిరీ ఫామ్‌కు నిత్యం 60 లీటర్ల వరకు పాలు విక్రయిస్తోంది. వాళ్లు లీటర్ రూ.1 కమిషన్ చెల్లిస్తారు. సొంతం పాలు, రైతుల పాలు విక్రయిస్తూ ఖర్చులు పోను నెలకు సుమారు రూ.60వేల వరకు సంపాదిస్తోంది. అనిత స్వయం ఉపాధితో మరొకరికి ఉపాధి కల్పిస్తోంది.

మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలి

తెలంగాణ హైకోర్టు న్యాయవాది కీర్తిఅనంత


కేపీఆర్‌ఐటీలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న అతిథులు, కళాశాల యాజమాన్యం

ఘట్‌కేసర్: మగవారికి దీటుగా మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందుండాలని తెలంగాణ హైకోర్టు న్యాయవాది కీర్తిఅనంత, ఆర్సీషియం కంపెనీ హెడ్ సుజితా రావూరి, వెరిటాస్ ప్రైమ్ ల్యాబ్స్ హెచ్‌ఆర్, బిజినెస్ పార్టనర్ రిధిమారావు అన్నారు. శుక్రవారం ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(కేపీఆర్‌ఐటీ) నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఇతరులపై ఆధార పడకుండకు విద్య, వైద్య, ఉద్యోగ, సాంకేతిక రంగాలలో సాధికారత సాధించాలన్నారు. మహిళల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాని కోరారు. ఈ కార్యక్రమంలో కేపీఆర్‌ఐటీ డైరెక్టర్ కొమ్మూరి దివ్యరెడ్డి, డైరెక్టర్, ప్రొ. సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్‌లు రవీంద్రే ఎక్లార్, శ్రీనివాస్‌రెడ్డి, మహిళ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన మహిళలకు సత్కారం


ఎస్ఎన్ఆర్‌జీలో మహిళలను సత్కరిస్తున్న ఏబీఆర్ఎస్ఎం ప్రొ. సంపత్‌కుమార్

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి విద్యా సంస్థల్లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), లోకమాతా దేవి అహిల్యా మహోల్కార్ అసోసియేషన్‌తో ఉమెన్స్ డే వేడుకలు జరిగాయి. ఏబీఆర్ఎస్ఎం టీం మెంబర్ ప్రొ. డాక్టర్ పట్టెం సంపత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. అనంతరం ప్రతిభావంతులైన మహిళలను ప్రశంసపత్రాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, ఉమెన్‌సెల్ కన్వీనర్ డాక్టర్ రష్మిత్రివేదీ, డీన్లు, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్‌ఐఈటీలో అహల్యాబాయి జయంతి


అహల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐఈటీ కళాశాలలో శుక్రవారం లోకమాత అహల్యాబాయి హోల్‌కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కళాశాలలో ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని పరిరక్షించడంలో ఆమె పాత్రను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎమ్మార్‌సీఈ ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ కేంద్రం వద్ద మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో అంగన్‌వాడీ-1 కేంద్రంలో టీచర్లు, ఆయమ్మలు లేకపోవడం విచారకరమని మాజీ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ నిర్వహణలో ఉన్న 24 అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయమ్మల కొరత ఉందని, సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాలామృతం కూడా అందించలేని స్థితిలో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

తాగునీటి లీకేజీని అరికట్టండి


గ్రామ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

మేడ్చల్: శాహజాదిగూడలోని మల్కపేట పెంటయ్య ఇంటివద్ద సీసీరోడ్డు మధ్యలో నుంచి తాగునీరు లీకేజీ అవుతుందని, రావల్‌కోల్ గ్రామకార్యదర్శి దృష్టికి సీపీఎం మండల కార్యదర్శి నరేష్, గ్రామ కార్యదర్శి కొండయ్య తీసుకెళ్లారు. లీకేజీ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. తాగునీరు వృథాగా పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. లీకేజీతో ఇళ్లకు సరిపోయేలా నీటి సరఫరా జరగడంలేదని తెలిపారు. దీనిపై గ్రామ కార్యదర్శి స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నారపల్లిలో క్రేన్ బోల్తా



పోచారం: నారపల్లిలోని మెక్‌డోనాల్డ్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం క్రేన్ పల్టీ కొట్టింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదం చోటు చేసుకుంది. సమీపంలో ఉన్న సెంట్రల్ లైటింగ్‌పోల్‌ను క్రేన్ ఢీకొట్టింది. దీంతో క్రేన్ పల్టీ కొట్టింది. ఆయిల్ ట్యాంక్ నుంచి డీజిల్ లీకైంది. క్రేన్‌రోడ్డుకు అడ్డుగా పడిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

ఫెసిలిటేషన్ కౌన్సిల్‌తో వివాదాలు పరిష్కారం

సాక్షి,సిటీబ్యూరో: పారిశ్రామికవేత్తలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించేందుకు శుక్రవారం నగరంలోని చర్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిల్ సమావేశం జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో పరిశ్రమలశాఖ ఏడీ, ఎల్‌డీఎం, అధీకృత సభ్యులు పాల్గొనగా, పారిశ్రామికవేత్తల వివాదాలకు సంబంధించి 70 కేసులను విచారించారు. పారిశ్రామికవేత్తలు తమ కేసులను పరస్పరం చర్చించుకోవటం ద్వారా రూ.76.41 లక్షల విలువైన 3 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



వాలీబాల్ టోర్నీ విజేతగా వీబీఐటీ


బహుమతి అందుకుంటున్న వీబీఐటీ వాలీబాల్ జట్టు

ఘట్‌కేసర్: ఏవీఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముగిసిన రుద్రసదన్-25 పురుషుల వాలీబాల్ టోర్నీలో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) జట్టు విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నభి, కన్వీనర్ సురేష్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వీబీఐటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సమష్టి ఉద్యమాల్లో ఉద్యోగులు కీలకం కావాలి

ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



సాక్షి,సిటీబ్యూరో: ఎల్‌ఐసీ ఉద్యోగులు చైతన్యవంతమైన అవగాహనతో సమాజంలోని మహిళల స్థితిగతులను అధ్యయనం చేసి, సమష్టి ఉద్యమాలలో తమవంతు పాత్రను పోషించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని హైదరాబాద్ డివిజనల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని భారతీయ జీవిత బీమా సంస్థ క్లాస్-3, 4 ఉద్యోగసంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) మహిళా సబ్ కమిటీ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలకపక్షాలు బడా పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు ఈ చర్యలను ఎండగడుతూ మరిన్ని పోరాటాలు చేయాలని, ఇందులో ఎల్‌ఐసీ ఉద్యోగులు ముఖ్యంగా మహిళలు ముందు నిలవాలని మల్లులక్ష్మి పిలుపునిచ్చారు. ఉద్యోగ సంఘం (ఏఐఐఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా, ఎల్‌ఐసీ హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రమోదకుమార్ సాహూ, సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య, నాయకులు శ్రీనివాసన్, గిరిధర్, మద్దిలేటి, గణేష్, రవీందర్, యాదగిరిరావు, ఝాన్సీలక్ష్మి, మైథిలి, సరస్వతి పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన పీఈటీ సస్పెన్షన్

కీసర: ఆడుకునేందుకు రాలేదని విద్యార్థులను కర్రతో చితకబాదిన వ్యాయామ ఉపాధ్యాయుడిని (పీఈటీ) సస్పెండ్ చేస్తూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల విద్యాశాఖ అధికారి విజయకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం కీసరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్ ఏడుగురు విద్యార్థులను కర్రతో విచక్షణారహితంగా కొట్టిన విషయం తెలిసిందే. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి సదరు ఉపాధ్యాయుడు వ్యవహరించిన తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అతను స్కూల్‌కు రాకపోవడంతో ఇతర ఉపాధ్యాయులను నిలదీశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి పీఈటీని సస్పెండ్ చేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఉత్తర్వులు పంపారు.

పార్థివ వాహనసేవలో అటెండర్ల నియామకాలు

మేడ్చల్: ఈఎంఆర్‌ఐ-హెచ్ఈఆర్ఎఫ్ సంస్థ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో నిర్వహించే ఉచిత పార్థివ వాహనసేవలో అటెండర్లుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ జాన్ షాహిత్ తెలిపారు. అనుభవం లేకున్నా ఏడో తరగతి పాస్ లేదా ఫెయిలైన అభ్యర్థులు ఈనెల 8, 10, 11 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు హైదరాబాద్‌లోని కింగ్‌కోఠీ డిస్ట్రిక్ట్ గవర్నమెంట్ ఆసుపత్రిలో బయోడేటా, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, విద్యార్హతల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకి హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9100799259.

కీసర ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం



కీసర: ఎమ్మార్పీఎస్ కీసర మండల అధ్యక్షుడిగా మంచాల మహేందర్‌మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కీసరగుట్టలో మండల ఇన్‌చార్జి బుడిగె జగన్‌మాదిగ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా మహేందర్, ఉపాధ్యక్షుడిగా తుడుం బాలరాజు, మహిళా ఎమ్మార్పీఎస్ అధ్యక్షురాలిగా నాగాయపల్లి సుజాత ఎన్నికయ్యారు. కీసర మాజీ అధ్యక్షుడు బక్కని కుమార్, కీసర మండల అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మెరుగు రవీందర్, ఎమ్మార్పీస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బందెల పరమేష్, ఉపాధ్యక్షుడు మీసాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి మంచాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సముచిత గౌరవం దక్కాలి


నాగారం జెడ్పీ స్కూల్‌లో పాల్గొన్న మహిళలు

కీసర: నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యఅతిథిగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు జ్యోతి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు సమానత్వంతో పాటు సమున్నత గౌరవం దక్కాలన్నారు. అన్ని రంగాలను శాసించే స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా టీచర్లను సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు పీసీ రాములు, ఉపాధ్యాయులు అరవింద్ కుమార్, అజీజ్‌పాషా, మాలోత్‌నాయక్, పాండు రంగారెడ్డి నిర్వాహకులుగా వ్యవహరించారు. సీనియర్ ఉపాధ్యాయులు వనజ, సుమతి, కమల, సంతోషమ్మ, శైలజ, వనిత, వాలంటీర్ స్వప్న, శ్రీవిద్య, అల్కా, శ్రావణి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం.. ఇల్లు దగ్ధం


కాలిపోయిన బీరువా, ఇతర వస్తువులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లో శుక్రవారం ఓ గుడిసె అగ్నికి ఆహుతైంది. దండ్ల బిక్షపతి కుటుంబం గ్రామంలో ఓ ఖాళీ స్థలంలో పూరి గుడిసె ఏర్పాటు చేసుకుని కుటుంబంతో నివాసం ఉంటూ వడ్డెరి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా శుక్రవారం ఉదయం ఇంట్లో పూజలో భాగంగా దీపం వెలిగించారు. కాసేపటికి కుటుంబసభ్యులు రోజువారి కూలీకి వెళ్లేందుకు గుడిసెకు తాళం వేసి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గుడిసెలో ఉన్న దీపం ప్రమాదవశాత్తు ఇతర వస్తువులకు అంటుకోవడంతో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో వారు గుడిసె వద్దకు చేరుకోగా అప్పటికే గుడిసెలో ఉన్న బీరువా, ఇంటి సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో వారు సర్వం కోల్పోవడంతో తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చెత్త సేకరణపై నిర్లక్ష్యం ..!

- తడి,పొడి చెత్త సేకరణలో నెరవేరని లక్ష్యం
- 11 పురపాలికల్లో విలీనమైన 40 జీపీల్లో చెత్తసేకరణపై అవగాహన కరువు
- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో 29 పురపాలక సంఘాలు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలికల్లో తడి, పొడిచెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉండగా.. రోజూ లక్షకు పైగా జనాభా కలిగిన పురపాలికలో దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. పురపాలికల్లో తడి,పొడి చెత్తను వేరుచేసి అందించాల్సి ఉన్నా.. ఎక్కడా సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది.

◆ జిల్లాలోని 7 పురపాలక సంఘాల్లో 28 గ్రామ పంచాయతీలు విలీనం కాగా, రంగారెడ్డి జిల్లాలోని 4 పురపాలక సంఘాల్లో 12 గ్రామ పంచాయతీలను కలిపారు. విలీనమైన పంచాయతీల పరిధిలోని ప్రజలకు చెత్త సేకరణపై అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ, చేపట్టలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే విలీన గ్రామ పంచాయతీల్లో తడి,పొడి చెత్త సేకరణపై తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఫిర్యాదు చేస్తేనే స్పందన..

పురపాలికల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తడి, పొడి చెత్త సేకరణ అమలు కావడం లేదు. వార్డు అధికారులు చెత్త సేకరణను నిత్యం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ సక్రమంగా చేయడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవగాహన కల్పించి వ్యర్థాల సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. పట్టణ ప్రజలు కూడా ఎప్పటికప్పుడు చెత్త సేకరణలో జరుగుతున్న జాప్యాన్ని తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వే నెంబర్ 592లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను శుక్రవారం తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల సమక్షంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుచరిత మాట్లాడుతూ.. ప్రభుత్వభూముల రక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్‌లు వేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, కబ్జాదారులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వీరేంద్రసాయి, రమేష్, సిబ్బంది రవి, సాయి, కాశీరాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌నగర్‌లో కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది